సాక్షి
తిరుపతి

సోమవారం ၊ 25 ၊ డిసెంబర్ ၊ 2023



వైభవం.. తెప్పోత్సవం

తిరుపతి నగరంలోని కపిలతీర్థంలో కపిలేశ్వరస్వామి తెప్పోత్సవాలు ఆదివారం వైభవంగా సాగుతున్నాయి. - 8లో



శాస్త్రోక్తం.. హనుమద్ వ్రతం

పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో హనుమద్ వ్రతాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 8లో



బస్సులో నోట్ల కట్టలు స్వాధీనం

హైదరాబాద్ నుంచి చెన్నైకి వెళుతున్న బస్సులో ఎలాంటి రశీదుల్లేని నోట్ల కట్టలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

కరువుకు చిరునామాగా ఉన్న ఈ సీమకు కృష్ణాజలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. క్షామపీడిత జిల్లాలోని పడమటి మండలాల ప్రజలకు హంద్రీ–నీవా జలాలను అందించి, ఇక్కడి భూములను సస్యశ్యామలం చేయాలనే కృత నిశ్చయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. శ్రీశైలం నుంచి కుప్పం వరకు కృష్ణా జలాలను తరలించి, కర్షకుల కళ్లలో ఆనందం చూడాలని సంకల్పించింది. దీంతో భూములకు సాగునీరు సమృద్ధిగా అందనుంది. ఇప్పటికే పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లె మండలాలకు చేరిన హంద్రీ–నీవా జలాలు వి.కోట మండలంలోకి చేరనున్నాయి. ఫలితంగా ఇక రాయలసీమ.. ఇక రాజలసీమగా మారనుంది.

రాజలసీమ



బైరెడ్డిపల్లె నుంచి వి.కోటకు వెళుతున్న కృష్ణా జలాలు

బిరబిరా పరుగులెడుతున్న కృష్ణమ్మ!

- కుప్పం నియోజకవర్గానికి చేరుకోనున్న హంద్రీ–నీవా జలాలు
- ఇకపై ఇక్కడి భూములు పచ్చటి పంటలతో సస్యశ్యామలం
- పెరగనున్న భూగర్భజలాలు, మారనున్న రైతన్నల బతుకులు
- ఆనందోత్సాహాల్లో పలమనేరు, కుప్పం నియోజకవర్గ ప్రజలు

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతమైన కుప్పం, పలమనేరు ప్రజల దశాబ్దాల కల ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాకారమైంది. హంద్రీ–నీవా పుంగనూరు ఉప కాలువ నుంచి కుప్పం ఉపకాలువకు కృష్ణా జలాలు శరవేగంగా పరుగులెడుతున్నాయి. ప్రస్తుతం పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లె మండలాలను దాటి హంద్రీ–నీవా జలాలు వి.కోట మండలంలోకి చేరనున్నాయి. మరికొన్ని రోజుల్లో కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రంలోకి కృష్ణమ్మ పరుగులు తీయనుంది. గతంలో వెయ్యి నుంచి 2 వేల అడుగుల వరకు బోర్లు వేసి గంగ జాడ లేక కుంగిన రైతులకు హంద్రీ–నీవా జలాలు కొండంత ఊరట నివ్వనున్నాయి. సాగుకు కష్టాలు తీరనున్నాయి.

భారీగా పెరగనున్న భూగర్భజలాలు

జిల్లాలోనే మెట్టప్రాంతాలైన కుప్పం, పలమనేరులో వర్షాలు లేక కరువు నెలకొన్న సమయంలో 2 వేల అడుగులు బోరుబావులు తవ్వినా గంగ జాడ కనిపించదు. అయితే 2019 నుంచి ఏటా ఈ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు పెరిగి 600 నుంచి 900 అడుగులకు చేరాయి. ఇప్పుడు హంద్రీ–నీవా జలాలు కాలువలో ప్రవహించడం ద్వారా భూగర్భజలాలు మరింత పెరగడం ఖాయం. దీంతో జిల్లాలోనే ఎక్కువగా బోర్లను నమ్ముకుని సేద్యం చేసే రైతులకు మేలు కలగనుంది.

పడమటి రైతులకు బోర్లే ఆధారం

రాష్ట్రంలోనే బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేసే జిల్లాల్లో చిత్తూరు ప్రముఖంగా ఉంది. జిల్లాలోని పడమటి నియోజకవర్గాల్లో 80 శాతం మంది రైతులకు సాగునీటి వనరు బోర్లే. ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రస్తుతం వరి 400 హెక్టార్లు, టమాట, కూరగాయలు, తీగ పంటలు 10 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో మొత్తం బోరుబావులు 30వేల వరకు ఉన్నాయి. ఈ బోరుబావుల్లో గత వేసవిలో నీరు రాకుండా ఆగినవి మూడు వేల వరకు ఉన్నాయి.

> కుప్పానికి పాలారు జలాలు చాలా అవసరమని తెలిసినా వాటిని రాకుండా అడ్డుకున్నది సాక్షాత్తు చంద్రబాబేనని కుప్పం ప్రజలకు ఇప్పటికే తెలుసు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పనులు చేస్తే తనకు ఎక్కడ ఇబ్బంది వస్తుందోనని అప్పటి తమిళనాడు సీఎం జయలలితతో కుమ్మక్కై పాలారు నీటి వ్యవహారాన్ని కోర్టు కెక్కించింది ఆ మహానుభావుడే.

కుప్పం బ్రాంచి కెనాల్‌తో రైతులకు జరిగే మేలిలా..

- కృష్ణా నది నుంచి 120 టీఎంసీల నీటిని ఇక్కడికి తరలించనున్నారు.
- పుంగనూరు ఉపకాలువ నుంచి 143.9 కిలో మీటర్ల మేర కుప్పం ఉపకాలువ ద్వారా పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు మేలు.
- ఎనిమిది మండలాలకు 4.02 లక్షల మందికి తాగునీరు, 110 చెరువులకు నీటిని మళ్లించడంతో ఇక్కడి చెరువుల ఆయకట్టులోని 6,300 ఎకరాల భూములకు సాగునీరు అందనుంది.
- పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పనున్నాయి.
- 6,300 ఎకరాల్లో చెరువుల కింద ఆయకట్టు స్థిరీకరణకు 0.5 టీఎంసీల సాగునీరు, 4.02 లక్షల మందికి 0.6 టీఎంసీల తాగునీరు అందనుంది.
- కుప్పం నియోజకర్గంలోని గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో రూ.250 కోట్లతో ఓ టీఎంసీ నీటితో రెండు రిజర్వాయర్ల నిర్మాణం.

హంద్రీ–నీవాలో జలాలు రావడంతో ఎండిన బోర్లలోనూ నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాంత రైతుల బతుకులు మారనున్నాయి.

పడమటి ప్రజలను ఏమార్చిన బాబు

మూడు దశాబ్దాలు ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా కుప్పానికి చంద్రబాబు చేసిందేమీ లేదు. 2019 ఎన్నికల్లో కుప్పం ప్రజలను ఏమార్చేందుకు పలమనేరు సమీపంలోని గంగ్రాజుపల్లె వద్ద హంద్రీ–నీవాలో నీరు వదిలామంటూ జల హారతి పేరిట గంగమ్మకు చంద్రబాబు ప్రత్యేక పూజలు చేసి, హంగామా చేశారు. కానీ అది హంద్రీ–నీవా కోసం చంద్రన్న డ్రామా అని జనానికి తెలిసిపోయింది.

ఎండిన బోర్లకు ఇక విముక్తి



“ మా పొలాలు హంద్రీ–నీవా కాలువ ఆనుకుని ఉన్నప్పటికీ నీరు లేక పంటలు ఎండిన పరిస్థితులున్నాయి. కరువు సమయంలో బోరులో నీటి శాతం పూర్తిగా తగ్గిపోవడంతో పొలాలు బీడుగానే మిగిలిపోయేవి. హంద్రీ–నీవా కాలువలో శాశ్వతంగా నీరు ప్రవహించనుండడంతో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో ఎప్పుడూ బోరులో నీరు తగ్గడం అన్న మాటే ఉండదు. ఇంతటి గొప్ప అవకాశాన్ని మాకందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోతారు.

– శ్రీరాములురెడ్డి, రైతు, పసుపత్తూరు, గంగవరం మండలం

పైపులు దించేబాధ తప్పినట్టే



మాకు గ్రామంలో పదెకరాల భూములున్నాయి. నాలుగు బోర్ల ద్వారా సేద్యం చేస్తున్నాం. ఒక్కొక్క బోరు 750 నుంచి 1600 అడుగుల వరకు డ్రిల్ చేశాం. కానీ వేసవిలో నీరు రాక అదనంగా పైపులను దించాల్సి వచ్చేది. కొన్ని బోర్లు వేసవిలో నీరు రాక ఎండిపోయేవి. కానీ ఈ నాలుగేళ్లుగా వానలు బాగా పడి నీటి సమస్య లేదు. ఇప్పుడు హంద్రీ–నీవా కాలువలో నీరు రావడంతో భవిష్యత్‌లో భూగర్భజలాలు పెరిగి మాకు నీటి సమస్యలుండవనే అనుకుంటున్నాం.

– రాధారెడ్డి, పిచ్చిగుండ్లపల్లె, బైరెడ్డిపల్లె మండలం

భూగర్భజలాలు పెరగడం ఖాయం



హంద్రీ–నీవా జలాలు ప్రస్తుతం బైరెడ్డిపల్లె మండలం దాటి వీకోట మండలంలోకి ప్రవేశిస్తున్నాయి. ఇది మెట్ట ప్రాంతం. కేవలం బోర్ల ద్వారానే పంటలకు సాగునీరు అందుతోంది. కనీసం వెయ్యి అడుగులు బోరు తవ్వితేనే మంచిగా నీరు వస్తోంది. ఇప్పుడు హంద్రీ–నీవా జలాలు వస్తుండడంతో భూర్భజలాలు పెరిగి, ఇక్కడి రైతులకు బోర్లలో నీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. గతంలో ఇక్కడి రైతులు బోర్లు వేసి గంగ జాడ లేకుండా రూ.లక్షల్లో నష్టపోయారు. ఇకపై ఆ సమస్య రానట్టే.

– రెడ్డెప్ప, ఎంపీపీ, బైరెడ్డిపల్లె

మూడు బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు



నాకు మా గ్రామంలో రెండెకరాల భూమి ఉంది. ఇందులో గతంలో మూడు బోర్లు వేశాను. కానీ చుక్క నీరు రాలేదు. దీంతో రూ.6 లక్షల నష్టం మిగిలింది. ఇక చేసేదిలేక పొలం బీడుగానే వదిలిపెట్టాను. ఇప్పుడు మా భూముల సమీపంలోకి హంద్రీ–నీవా జలాలు వస్తున్నాయి. దీంతో భూగర్భజలాలు పెరిగి మా బోర్లలో నీళ్లు వస్తాయనే ఆశ ఉంది. నీరు వస్తే ఉన్న పొలంలో ఏదో ఒక పంట సాగు చేసుకుని మా కుటుంబాన్ని పోషించుకుంటాను. జగనన్న పేరు మేము తలచుకుంటాం.

– రామప్ప, తీర్థం, బైరెడ్డిపల్లె మండలం

నేడు క్రిస్మస్ వేడుకలు



తిరుపతి వెస్ట్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



వెస్ట్‌చర్చి ఆవరణలో విద్యుత్ వెలుగుల్లో ఏసుప్రభు

తిరుపతి కల్చరల్: లోకక్షకుడు, శాంతిదూత యేసయ్య జన్మదినం సందర్భంగా క్రిస్మస్ సందడి మొదలైంది. క్రిస్మస్ వేడుకలకు జిల్లావ్యాప్తంగా చర్చిలు సుందరంగా ముస్తాబయ్యాయి. ప్రధానంగా జిల్లాలోని ప్రధాన చర్చిలు, క్రైస్తవ మందిరాలు పురాతన చర్చిలు, ప్రార్థనా మందిరాలు రంగు రంగుల విద్యుద్దీపాలంకరణలతో వెలిగిపోతున్నాయి. నగరంలో ఈస్ట్ చర్చి, వెస్ట్ చర్చి, జగన్నాత చర్చి, షెకీనా చర్చిల వద్ద ప్రత్యేక సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. చర్చిల్లో ప్రత్యేకంగా పశువుల పాకను రూపొందించారు. ఇందులో యేసు క్రీస్తు జన్మ వృత్తాన్ని తెలిపే విధంగా అద్భుత రీతిలో బొమ్మలను కొలువుదీర్చారు. క్రైస్తవులు తమ గృహాల వద్ద స్టార్స్‌ను ఏర్పాటు చేసి క్రిస్మస్ వేడుకలకు సన్నద్ధమయ్యారు. పండుగకు కావాల్సిన అలంకరణ వస్తువులు వివిధ ఆకృతుల్లో కొలువుదీరాయి. విభిన్న మాస్కులు, కీ చైన్లు, స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, బెలూన్‌లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటిని కొనుగోలుతో క్రైస్తవుల సందడి నెలకొంది. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ఆరంభమయ్యాయి.

జీవితాల్లో వెలుగులు నిండాలి







డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి, ఆర్‌కే.రోజా

చిత్తూరు కలెక్టరేట్ : క్రైస్తవులు జీవితాల్లో వెలుగులు నిండాలని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపీలు ఎం.గురుమూర్తి, మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జేసీ శుభం భన్సల్‌తోపాటు ఎమ్మెల్యేలు ఆకాంక్షించారు. వీరు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ పండుగను జరుపుకుంటున్న క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత జీవనం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు మనుషులను సన్మార్గంలో నడిపిస్తాయని తెలిపారు. శాంతియుత జీవన మార్గాన్ని చూపిన క్రీస్తు జన్మదిన వేడుకలను జిల్లాలోని క్రైస్తవులు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

● భక్తజన ‘కొండ’



ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తిరుమలలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ పరిసరాలతో పాటు నారాయణగిరి ఉద్యానవనం, డార్మెటరీలు, జర్మన్ షెడ్లు కిటకిటలాడాయి. వసతి గదులు దొరక్క భక్తులు ఆలయ పరిసరాల్లోనే సేదతీరడం కనిపించింది.

– తిరుమల

ముక్కోటి ద్వాదశి రద్దీ



తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



హారతి అందుకుంటున్న భక్తులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకన్న ఆలయంలో ముక్కోటి ద్వాదశి రద్దీ కొనసాగుతోంది. వైకుంఠ ద్వాదశి పర్వదినాన వేలాది మంది భక్తులు వైకుంఠ ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తుమ్మలగుంటకు తరలివచ్చారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు నిరంతరాయంగా తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచారు. పోలీసులు వాహన పార్కింగ్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం

వైకుంఠ ద్వాదశి పర్వదినాన తుమ్మలగుంట ఆలయం ఎదుట ఉన్న కోనేరులో సుదర్శన చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. అంతకుముందు అర్చకులు వేడుకగా తిరుమంజనం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన క్రమంలో సకల దోష నివృత్తికి చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ ప్రధాన అర్చకులు అనంతాచార్యులు పేర్కొన్నారు.

నేటి స్పందన రద్దు

తిరుపతి అర్బన్: ప్రతివారం కలెక్టరేట్‌లో నిర్వహించే సోమవారం స్పందన రద్దు చేస్తున్నట్లు కలెక్టరేట్ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సోమవారం క్రిసమస్ పండుగ నేపథ్యంలో ప్రభుత్వ సెలవు ఉండడంతోనే స్పందన రద్దు చేస్తున్నట్లు వివరించారు. ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలని కోరారు.

నాలుగేళ్లలో 30 ఏళ్ల అభివృద్ధి

- పుంగనూరు ప్రగతికి సీఎం సహకారం
- 28 అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి



దుర్గసముద్రం వద్ద అదనపు సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: పుంగనూరు నియోజకవర్గంలో రాబోయే 30 ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధిని ఊహించని రీతిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నాలుగేళ్లలో చేశామని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని 14 పంచాయతీల్లో రూ.13 కోట్ల వ్యయంతో చేసిన 28 అభివృద్ధి పనులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పుంగనూరు అభివృద్ధి కోసం సీఎం సహకారం మరువలేనదని కొనియాడారు. గతంలో ఏ పాలకులు చేయని విధంగా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కొరత లేకుండా సమకూర్చారని చెప్పారు. గృహాలు, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలనే ఆశయంతో కొండామర్రి, బిల్లేరు, దుర్గసముద్రం వద్ద రూ.10 కోట్లతో మూడు అదనపు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలిపారు. ప్రతి గ్రామానికి శుద్ధి జలాలు అందించాలనే ధ్యేయంతో ఆర్వోఆర్ ప్లాంట్లను మండల వ్యాప్తంగా 25 ప్రదేశాల్లో ఏర్పాటు చేశామని, తద్వారా ఉచితంగా ప్రజలకు శుద్ధినీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా నీటిని అందించడంతో పాటు వ్యవసాయానికి సాగునీటి కొరత లేకుండా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కుల, మత, పార్టీలకతీతంగా పేదరికమే కొలమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వం మళ్లీ రావాలని ప్రజలందరూ గుర్తించి, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పుంగనూరు నియోజకవర్గ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదర రాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సర్వీస్‌లో బెంచ్ మార్క్ సాధించాలి



డీకే బాలాజీని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఆర్వో పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: ఏ అధికారి అయినా తమ సర్వీసులో ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టినప్పుడు, ఆ పనులు ఓ బెంచ్ మార్క్‌గా జీవితంలో నిలిచిపోతాయని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల ఆరోగ్యశ్రీ సీఈవోగా బదిలీపై వెళ్లిన డీకే బాలాజీని కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. జేసీ ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి అధికారులందరూ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్త ఏర్పాటైన తిరుపతి జిల్లాలో డీకే బాలాజీ జేసీగా 20 నెలలు పనిచేశారని చెప్పారు. ఆయన ప్రధానంగా భూముల రీ సర్వే, సివిల్ సప్లై, నేషనల్ హైవేస్, దీర్ఘకాలిక భూముల రిజిస్ట్రేషన్లు(22ఏ జాబితాలోని) తదితర సమస్యలకు సరైన పరిష్కారం చూపడంలో డీకే బాలాజీ కృషి అభినందనీయమని చెప్పారు. డీకే బాలాజీ మాట్లాడుతూ కొత్త జిల్లాతోపాటు తిరుపతి పుణ్యక్షేత్రంలో పనిచేసే అవకాశం లభించడం ఎంతో సంతృప్తిగా ఉందని చెప్పారు. డీఆర్వో పెంచల కిషోర్ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ, రీసర్వే తదితర ప్రాధాన్యత అంశాలను సమర్థవంతంగా అమలు చేసి పురోగతి సాధించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పలువురు జిల్లా అధికారులు జేసీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులతోపాటు డివిజన్ స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు ఆదివారం ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు అన్ని యూజీ కోర్సులకు సంబంధించి 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి తనిఖీ



కార్మిక శాఖ కార్యదర్శికి స్వాగతం పలుకుతున్న ఈఎస్‌ఐ ఆస్పత్రి అధికారులు, డాక్టర్లు

తిరుపతి తుడా: నగరంలోని కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్‌ఐ) ఆస్పత్రిని ఆదివారం కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్తి అహూజ తనిఖీ చేశారు. ఆమెకు ఆస్పత్రి డాక్టర్లు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆస్పత్రిలోని అత్యవసర విభాగం, ఆపరేషన్ థియేటర్లు, మహిళా, పురుషుల ఇన్‌పేషంట్ వార్డులను, ఓపీ విభాగం, ల్యాబ్, ఫిజియోథెరపీ, స్టోర్స్‌ను తనిఖీ చేసి పేషంట్ల రికార్డులను పరిశీలించారు. అనంతరం వార్డులో చికిత్స పొందుతున్న రోగుల నుంచి వైద్య సేవల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అంటూ ఆరా తీశారు. 2021లో గడువు ముగిసిన సర్జికల్, ల్యాబ్, డ్రెస్సింగ్స్ వంటి ఈఎస్‌ఐ సీ రేట్ కాంట్రాక్టు బుక్స్ పునరుద్ధరణ చేయాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఏపీ, తమిళనాడు ఈఎస్‌ఐ కార్పొరేషన్ రాష్ట్ర రీజినల్ డైరెక్టర్లు వేణుగోపాల్, కిరణ్ కుమార్, తిరుపతి ప్రాంతీయ కార్యాలయ అధికారులు రాధాకృష్ణ, రజనీకాంత్ పాల్గొన్నారు.

నిత్య వ్యాయామంతో ఆరోగ్యం



వాక్ థాన్‌లో యువత, విద్యార్థులు

తిరుపతి కల్చరల్: ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ గంటపాటు నడక, నిత్య వ్యాయామం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. అమెరికా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీ యూనివర్సిటీ స్టేడియం నుంచి మహతి కళాక్షేత్రం వరకు వాక్ థాన్–2023 నిర్వహించారు. దీన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యాయామాన్ని నిత్య అలవాటుగా మార్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండగలమన్నారు. అనంతరం ఆటా ప్రతినిధి మధు బొమ్మినేని, ఆటా వేడుకల చైర్మన్ జయంత్ చల్లా తాము చేపడుతున్న సమాజ సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆటా ప్రతినిధులు సతీష్‌రెడ్డి, పరమేష్ భీమ్‌రెడ్డి, కాశీ కొత్త, ఈశ్వర్ బండా, అనిల్ కుమార్, ఎస్వీయూ రుషా విభాగం అధికారి వంశీ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు వెండి కలశాలు

చిల్లకూరు: నెల్లూరుకు చెందిన దంపతులు రూ.3 లక్షల విలువ చేసే వెండి కలశాలు తీర ప్రాంతంలోని ముత్యాలమ్మకు కానుకగా అందించారు. అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉదయం అమ్మవారికి పలు రకాల అభిషేకాల అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన దంపతులు అమ్మవారికి వెండి కలశాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.





సివిల్స్‌కు జగనన్న ప్రోత్సాహం

- మెయిన్స్ అభ్యర్థులకు సీఎం భరోసా
- జిల్లాలో ఇప్పటివరకు రూ.4 లక్షల పంపిణీ
- సీఎంకు రుణపడి ఉంటామంటున్న లబ్ధిదారులు


లబ్ధిదారులకు మెగా చెక్ అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి (ఫైల్)

తిరుపతి సిటీ: సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, ఉపాధి రంగాలకు పెద్దపీట వేస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వీసు ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అండగా నిలబడాలనే కృతనిశ్చయంతో జగనన్న సివిల్ సర్వీస్ ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశపెట్టారు. సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.1లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. జిల్లాలో సుమారు ఇప్పటి వరకు నలుగురు అభ్యర్థులకు రూ.4లక్షలు వారి ఖాతాలలో జమచేశారు. మెయిన్స్ పరీక్షలో ప్రతిభ చూపి ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.1.50లక్షలు ఆర్థిక సహాయం చేయనున్నారు. అభ్యర్థులు ఎన్ని సార్లు ప్రిలిమ్స్, మెయిన్స్ రాసి అర్హత సాధించిన ప్రతిసారీ ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించనుంది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ, అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు దేశంలోనే అత్యున్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపిక కావాలనే తపనతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది.

శఠగోపం పెట్టిన గత ప్రభుత్వం

గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కోచింగ్ ఇస్తామంటూ ప్రగల్భాలు పలికి శఠగోపం పెట్టింది. ప్రైవేటు కోచింగ్ సెంటర్లతో ఎంఓయూ కుదుర్చుకుని పలు యూనివర్సిటీలలో ఇంటిగ్రేటెడ్ కోర్సుల పేరుతో విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేసింది. అర్హతలేని వ్యక్తులతో బోధన ఇప్పించి వందల కోట్లు ప్రభుత్వ నిధులను దారి మళ్లించి ప్రైవేటు వ్యక్తులకు ముట్టచెప్పింది. కోచింగ్ తీసుకున్న ఒక్కరంటే ఒక్క అభ్యర్థి కూడా మెయిన్స్ పరీక్షల వరకు చేరుకోకపోవడం చూస్తే అభ్యర్థులను ఏ స్థాయిలో గత ప్రభుత్వం వంచించిందో అర్థమవుతోంది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సివిల్స్ ప్రిలిమ్స్ అర్హత సాధించిన అభ్యర్థులు దేశంలో నాణ్యమైన కోచింగ్ ఇచ్చే ప్రాంతాల్లో శిక్షణ పొందేందుకు జగనన్న ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది.

జగనన్న ప్రోత్సాహం ఒక వరం



నేను డిగ్రీ ఆర్కిటెక్చర్ కోర్సు చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో పూర్తి చేశాను. సివిల్స్ సర్వీస్‌లో ఉన్నత ఉద్యోగం సాధించాలనేది నా ప్రధాన లక్ష్యం. సివిల్ సర్వీస్ -2023 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులై మెయిన్స్‌కు అర్హత సాధించాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం కింద లక్ష రూపాయలు నేరుగా నా ఖాతలో జమ చేయడం సంతోషంగా ఉంది. పేదరికం కారణంగా ఆర్థిక పరిస్థితుల వల్ల కొనసాగించలేని విద్యార్థులకు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం పథకం ఓ వరం లాంటిది. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఆర్థిక సహాయం అందజేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాను.

-కే అనూష, సివిల్స్ అభ్యర్థి, నాయుడుపేట

చాలా సంతోషంగా ఉంది.



నేను నాగపూర్ ఎన్ఐటీ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాను. సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ప్రిలిమినరీ పరీక్ష రాశాను. ఉత్తీర్ణత సాధించి మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించాను. జగనన్న సివిల్ సర్వీస్ ప్రోత్సాహక పథకానికి దరఖాస్తు చేసుకున్నాను. వెంటనే ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.లక్ష నగదు నా ఖాతాలో జమ చేసింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులు సైతం ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని జగనన్న ఈ పథకం ప్రవేశపెట్టడం సంతోషంగా ఉంది. ఈ పథకాన్ని ఉపయోగించి మంచి శిక్షణ తీసుకుని రాష్ట్రం నుంచి మరింత మంది సివిల్స్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధిస్తారని భరోసా జగనన్న కల్పించారు.

-పీవీ సాయి శ్రీరామ్, సివిల్స్ అభ్యర్థి, శ్రీకాళహస్తి

ట్రాక్టర్ కింద పడి కౌలురైతు మృతి


మునిప్రసాద్ (ఫైల్)

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి కౌలురైతు మృతి చెందిన సంఘటన తొట్టంబేడు మండలం పాయ్య పంచాయతీలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు ఎస్సీకాలనీకి చెందిన గంథం మునిప్రసాద్(30) అదే గ్రామంలో రైతుల నుంచి కొంతభూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ప్రస్తుతం వరినాట్ల కోసం ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతుండగా డ్రైవర్ పక్కనే ముని ప్రసాద్ కూర్చున్నాడు. పొలంగట్టు సమీపంలో ట్రాక్టర్ మలుపు తిరుగుతుండగా ప్రమాదవశాత్తు ఆయన జారి ట్రాక్టర్ కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య శైలజ, నాలుగేళ్ల కుమార్తె మునిదీప్తి, రెండేళ్ల కుమారుడు మునీశ్వర్ ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి కేసు నమోదు

పెళ్లకూరు: మండలంలోని టెంకాయతోపు గ్రామానికి చెందిన మర్రి గజలక్ష్మీపై శ్రీకాళహస్తికి చెందిన మహబూబ్‌బాషా, ఇస్మాయేల్ మరో నలుగురు ఆదివారం దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు టెంకాయతోపు గ్రామంలో పొలాన్ని దున్నే విషయంలో గ్రామానికి చెందిన మర్రి మురళికి శ్రీకాళహస్తికి చెందిన మహబూబ్‌బాషాకి మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో మహబూబ్‌బాషా తన అనుచరులతో మురళి ఇంటికి వచ్చి వివాదానికి దిగారు. ఈ క్రమంలో మురళి భార్య గజలక్ష్మీపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవం.. తెప్పోత్సవం


పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న శ్రీసోమస్కందమూర్తి

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం రాత్రి తెప్పలపై విహరిస్తూ శ్రీసోమస్కందమూర్తి భక్తులను కటాక్షించారు. విద్యుద్దీపాలంకరణతో సుందరంగా రూపొందించిన తెప్పపై కొలువైన శ్రీసోమస్కందమూర్తి పుష్కరిణిలో ఐదు చుట్లు తిరుగుతూ భక్తులకు కనువిందు చేశారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై వృద్ధురాలు మృతి


మృతి చెందిన వృద్ధురాలు

గూడూరు రూరల్: గూడూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వృద్ధురాలు రైలు పట్టాలపై పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు విజయవాడ వైపు నుంచి చెన్నైకు వందే భారత్ రైలు వెళ్లిన కొద్ది సేపటికి పట్టాలపై పడి మృతి చెందింది. ఈ మృతదేహాన్ని పరిశీలించిన రైల్వే సిబ్బంది అక్కడ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

హత్య కేసులో వీడిన మిస్టరీ

- మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు ఛేదించిన పోలీసులు
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ భీమారావు వెల్లడి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భీమారావు, సీఐ అజయ్‌కుమార్


హత్యకు గురైన విద్యాలత (ఫైల్)

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం సమీపంలోని పంట కాలువలో శవమై తేలిన విద్యాలత అలియాస్ విద్య హత్యమిస్టరీ వీడింది. హత్య చేసింది ఆమె ప్రియుడి మొదటి ప్రియురాలు సుజాత అని శ్రీకాళహస్తి డీఎస్పీ భీమారావు తెలిపారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు దారితీసిన తీరును డీఎస్పీ వివరించారు. తిరుచానూరు సమీపంలోని కొత్త పాళెం ఎస్టీ కాలనీకి చెందిన లీలావతి(50), రవికుమార్ దంపతుల కుమారుడు శశికుమార్ అదే కాలనీకి చెందిన ఇద్దరు బిడ్డల తల్లిగా ఉంటూ భర్త, పిల్లలను వదిలేసిన సుజాత(36)తో ఎనిమిదేళ్లుగా సహజీవనం సాగిస్తున్నాడు. అయితే సుజాతపై మోజు తగ్గగానే ఆరు నెలల కిందట అదే తరహాలో భర్తతోపాటు ఇద్దరు పిల్లలను వదిలేసిన విద్యాలతను తీసుకెళ్లి తన ఇంట్లోనే ఉంచుకుని ఇద్దరితోనూ సహజీవనం చేయడం మొదలెట్టాడు. శశికుమార్‌తో విద్యాలత సహజీవనానికి రావడం నచ్చని సుజాత తరచూ విద్యాలతతో గొడవకు దిగేది. ఇదే సమయంలో ప్రియుడు శశికుమార్, విద్యాలత కువైట్ వెళ్లాలని చర్చించుకోవడం చూసిన సుజాత ఎలాగైనా విద్యాలత అడ్డుతొలగించుకోవాలని భావించింది. విద్యాలతను మట్టుపెట్టాలని సుజాత, శశికుమార్ తల్లి లీలావతితో కలిసి వ్యూహరచన చేసింది. ఈ నెల 16న శశికుమార్ ఇంట్లో లేని సమయంలో రాత్రి విద్యాలత నిద్రిస్తుండగా ముఖంపై దిండుతో అదిమి హతమార్చారు. మృతదేహాన్ని ప్లాస్టిక్ గోనెసంచిలో మూటగట్టారు. ఓ ఆటోను బాడుగకు మాట్లాడుకున్న సుజాత, లీలావతి మూటను ఆటోలో పెట్టుకుని అక్కడి నుంచి శ్రీకాళహస్తికి బయలుదేరారు. మిట్టకండ్రిగ వద్దకు రాగానే తొండమనాడు మార్గంలో అమ్మపాళెం క్రాస్ వద్ద అర్ధరాత్రివేళ మూట దించుకుని ఆటోడ్రైవర్‌ను అక్కడి నుంచి పంపేశారు. అనంతరం సమీపంలోని పంట కాలువలో విద్యాలత మృతదేహాన్ని పడేసి దానిపై కొబ్బరిమట్టలు కప్పి అక్కడ నుంచి తాపీగా నడుచుకుంటూ మిట్టకండ్రిగకు చేరుకుని బస్సులో ఇంటికి వెళ్లిపోయారు. 17న ఉదయం కాలువలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకుని గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి చేతిపై ఉన్న టాటూకు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించడంతో దామినేడుకు చెందిన పుష్ప అనే మహిళ మృతురాలు తన కుమార్తె విద్యాలతగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే దర్యాప్తు ప్రారంభించిన సీఐ నిందితులు సుజాత, లీలావతిని అదుపులోకి తీసుకుని తమదైనశైలిలో విచారణ చేపట్టడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తక్కువ సమయంలోనే కేసును ఛేదించారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు చెప్పారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరచడంతో జిల్లా ఎస్పీ రివార్డులు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు. రివార్డులు అందుకోనున్న రూరల్ సీఐ అజయ్‌కుమార్‌తోపాటు, ఏఎస్ఐ రాజు, కానిస్టేబుళ్లు వేమారెడ్డి, ఉదయ్‌కుమార్, ధనంజయ, భరత్, నాగరాజును డీఎస్పీ అభినందించారు.

ట్రావెల్ బస్సులో నోట్ల కట్టలు స్వాధీనం


పట్టుబడ్డ నగదు వివరాలు వెల్లడిస్తున్న డీఈఎస్పీ, సీఐలు

గూడూరు రూరల్: హైదరాబాద్ నుంచి చెన్నైకి వెళుతున్న ఓ ట్రావెల్ బస్సులో ఎలాంటి రశీదులు లేకుండా తరలిస్తున్న నగదును గూడూరు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఆదివా రం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి చెన్నైకి శనివారం రాత్రి బయలు దేరిన ట్రావెల్ బస్సు గూడూరు రూరల్ పరిధిలోని పోటుపాళెం సర్కిల్ వద్దకు ఆదివారం వేకువజామున చేరింది. బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి దగ్గర ఉన్న కొంత బంగారు కనిపించక పోవడంతో అతను పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు సిబ్బందితో కలిసి బస్సులో తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో బస్సులో ఇద్దరు ప్రయాణికులైన సత్తెనపల్లికి చెందిన శ్రీనివాసులు, మల్లేశ్వరావు అనే వారు చెన్నైకి వెళ్ళేందుకు పిడుగురాళ్ళ వద్ద బస్సు ఎక్కారు. వీరి వద్ద ఎలాటి పత్రాలు, రశీదులు లేని సుమారు రూ.55,87,080 నగదును ఎ నిమిది ప్యాకెట్లలో భద్రపరిచి తాము నిద్రించే సీట్ల కింద ఉంచుకుని ప్రయాణిస్తున్నారు. తనిఖీ చేస్తు న్న సీఐ పరిశీలించగా వారి వద్ద ఉన్న నగదుకు సంబంధించిన వివరాలు లేవు. దీంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. నగదు విషయంమై ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంటుకు కూడా సమాచారం ఇస్తున్నామన్నారు. అలాగే తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డికి సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. నగదు తో ప్రయాణిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, ఐడీ పార్టీ హెడ్ కానిస్టేబుల్ ఐవీరాజు, కానిస్టేబుల్, విష్ణుకుమార్, శ్రీనివాసులు, సురేష్, మిటాత్మకూరు వీఆర్ఓ కే పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం


పుట్టిన బిడ్డతో 108 సిబ్బంది

సైదాపురం: కష్టతరమైన కాన్పుని 108 సిబ్బంది సుఖ ప్రసవం చేసిన సంఘటన మండలంలోని చీకవోలు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు, చీకవోలు గ్రామానికి చెందిన ఆర్ చెంచమ్మ (24)కు ఆదివారం పురిటి నొప్పులు తీవ్రం కావడంతో స్థానికులు 108కు సమాచారం అందజేశారు. సైదాపురం 108 వాహనం సిబ్బంది సకాలంలో గ్రామానికి చేరుకున్నారు. చెంచమ్మకు ఈఎంటీ ఎం అశోక్‌కుమార్ ప్రాథమిక వైద్య సేవలను అందజేశారు. వాహనాన్ని తరలించే సమయంలోనే చాకచక్యంగా కాన్పు చేయడంతో సుఖప్రసవమై చెంచమ్మ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు 108 వాహన సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

చిత్తూరు కలెక్టరేట్ : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ విజయానందరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో 6 వ స్కై మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు అతిథిగా పాల్గొన్న విజయానందరెడ్డి మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ సాధనతో బాలబాలికల్లో శారీరక, మానసిక స్థైర్యం పెరుగుతుందని చెప్పారు. తద్వారా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సులువుగా ఎదుర్కొనవచ్చన్నారు.

శాస్త్రోక్తంగా హనుమద్‌వ్రతం



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి , స్వామివారికి క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఆదివారం హనుమద్ వ్రతాన్ని పురస్కరించుకుని ఆయజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెంచలకోన క్షేత్రంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి అభిముఖంగా ఉన్న క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి మూల మూర్తికి పాలు, తేనె, పెరుగు, పంచామృతాలతో అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. తిరుచ్చిపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి వివిధ రకాలు ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించి మేళతాళాలు మంగళవాయిద్యాలతో కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారికి వెయ్యినామాలతో ఆకుపూజ నిర్వహించారు. మాలాధారణ భక్తులు దీక్ష విరమించారు. ఉభయకర్తగా మధుసూదనరావు వ్యవహరించారు. కోనలోని భక్తులు క్షేత్రోత్సవంలో స్వామివారికి టెంకాయ కర్పూరం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్య స్వామి, అర్చకులు శశిస్వామి, నాగరాజస్వామి, మల్లికార్జున స్వామి, ప్రసాద్‌స్వామి పాల్గొన్నారు.

